అభ్యర్థులు టెర్రరిస్టులా?

- విద్యార్థులు చేసిన తప్పేంది?
- వారిని రెచ్చగొట్టి గద్దెనెక్కి వదిలేస్తవా?
- రేవంత్‌రెడ్డీ.. దమ్ముంటే ఇప్పుడు సెక్యూరిటీ లేకుండా అశోక్‌నగర్ వెళ్లు
- విద్యార్థుల అర్తనాదాలతో అశోక్‌నగర్ దద్దరిల్లుతున్నా మంత్రులకు పట్టదా?
- జీవో 29తో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు తీవ్ర అన్యాయం
- కోదండరాం గొంతు ఇప్పుడు ఎందుకు మూగబోయింది?
- సిద్దిపేట ప్రెస్‌మీట్‌లో హరీశ్‌రావు

సిద్దిపేటలోని తన క్యాంప్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు. చిత్రంలో నాయకులు ఫారూఖ్ హుస్సేన్, వేలేటి రాధాకృష్ణ శర్మ, కడవేర్గు రాజనర్సు, పాల సాయిరాం, మెరుగు మహేశ్

సిద్దిపేట, అక్టోబర్ 19 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : లారీలు, ఇనుప కంచెలు, ఇనుప బూట్లు, అక్రమ కేసులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నమ్ముకున్నాడని, వీటితోనే విద్యార్థులను అణచివేయాలని చూస్తున్నాడని మాజీ మంత్రి హరీశ్‌రావు మండిపడ్డారు. 'విద్యార్థులను అణచివేస్తామంటే ఉద్యమం మరింత ఉధృతమవుతుంది.. తస్మాత్ జాగ్రత్త' అని హెచ్చరించారు. శనివారం సిద్దిపేటలోని క్యాంప్ కార్యాలయంలో మీడియా సమావేశంలో హరీశ్ మాట్లాడుతూ గ్రూప్-1 అభ్యర్థులు, నిరుద్యోగుల పట్ల కర్కశంగా వ్యవహరిస్తూ అక్రమ కేసులు పెట్టి, భౌతిక దాడులకు పాల్పడితే ఊరుకునేది లేదని తేగేచిచెప్పారు. గ్రూప్, 1,2,3,4, ఇతర పరీక్షలకు తెలుగు అకాడమీ పుస్తకాలను ప్రామాణికంగా తీసుకొని పిల్లలు చదువుతారని దాన్ని కూడా మార్చేసి వికీపీడియా, ఇంటర్‌నెట్ విషయాలను ప్రామాణికంగా తీసుకోవలంటున్నారని ఇదేం పద్ధతి అని ప్రశ్నించారు. విద్యార్థులు ఏది ప్రామాణికంగా తీసుకోవాలో ప్రభుత్వం ఇంత వరకు క్లారిటీ ఇవ్వలేదని, ఇంత అయోమయం నడుమ పరీక్షలు నిర్వహిస్తున్నారని చెప్పారు. 'సమీక్ష చేయండి.. విద్యార్థులతో చర్చించండి..విద్యార్థులపై లాఠీ చార్జీ చేయడం కాదు.. అమానుషంగా విద్యార్థుల మీద దాడి చేయడం కాదు.. ఆ విద్యార్థులను పిలిచి మాట్లాడండి' అని సూచించారు. తమ హక్కులు కాపాడాలని, న్యాయం చేయాలని అశోక్‌నగర్‌లో పిల్లలు రోడ్ల మీదికి వస్తే వారిని ఇష్టవచ్చినట్టు లాఠీలతో కొడుతున్నారని, ఇనుప బూట్లతో తొక్కుతున్నారని, రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడాలని పిల్లలు కోరుతుంటే దొంగలను, టెర్రరిస్టులను కొట్టినట్టు కొడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. 'విద్యార్థుల వీపులు పగిలేలా శరీరం కమిలిపోయేలా కొడుతున్నారు. పొత్తి కడుపులో పిడిగద్దులు గుద్దుతున్నారు. ఆడపిల్లలను అర్ధరాత్రి పోలీస్ జీపులో తీస్కపోయి భయభ్రాంతుకుల గురి చేస్తున్నారు. విద్యార్థుల పట్ల రేవంత్ రెడ్డి ప్రభుత్వం కర్కశంగా వ్యవహరిస్తున్నది' అని మండిపడ్డారు. ఈ వైఖరిని ఖండిస్తున్నట్టు చెప్పారు.

> విద్యార్థుల ఆర్తనాదాలతో అశోక్‌నగర్ మర్మోగుతున్నా కాంగ్రెస్ పార్టీ మంత్రులు, ఎమ్మెల్యేల్లో చలనం లేదు. విద్యార్థులేమైనా హంతకులా? టెర్రరిస్టులా? నక్సలైట్లా? వాళ్లు ఏం తప్పుచేసిండ్రని గొడ్లను కొట్టినట్టు కొడుతున్నరు? ఒక్కపూట అన్నం తిన్నా తినకున్నా ఉద్యోగం సంపాదించాలని రాత్రింబవళ్లు కష్టపడి చదువుకునే విద్యార్థులను లాఠీలతో కొట్టి ఇనుపబూట్లతో తొక్కుతున్నరు. ఆడపిల్లలని కూడా చూడకుండా అర్ధరాత్రి పోలీస్ జీపులో తీస్కపోయి భయపెడుతున్నరు. -హరీశ్‌రావు

రాజ్యాంగానికి తూట్లు

రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రిజర్వేషన్ల అమలులో రాజ్యాంగ స్ఫూర్తికి తూట్లు పొడుస్తున్నదని హరీశ్ ఆగ్రహం వ్యక్తంచేశారు. జీవో 29 వల్ల ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు తీవ్ర అన్యాయం జరుగుతున్నదని చెప్పారు. రాహుల్ గాంధీ పొద్దున లేస్తే రాజ్యాంగాన్ని పట్టుకొని తిరుగుతారని, రాజ్యాంగాన్ని కాపాడాలని దేశమంతా తిరిగి సదస్సులు పెడుతుంటారని, అదే రాహుల్‌గాంధీ నేతృత్వంలో ఇక్కడి కాంగ్రెస్ ప్రభుత్వం, ఈ రేవంత్‌రెడ్డి రాజ్యాంగాన్ని ఖూనీ చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో ఎస్టీలకు 10 శాతం, ఎస్సీలకు 16 శాతం, బీసీలకు, ముస్లిం మైనార్టీలకు రిజర్వేషన్లు కల్పిస్తున్నామని, ఓపెన్ కాంపిటీషన్‌లో వచ్చినదాన్ని కన్సిడర్ చేయకూడదని చెప్పారు. ఓపెన్‌లో ఎవరైనా రావచ్చు అని చెప్పారు. ఓపెన్ కాంపిటీషన్ అయ్యాక మిగతా 50 శాతంలో రాజ్యంగం ఇచ్చిన రిజర్వేషన్‌ను అమలు చేసే పద్ధతిని కేసీఆర్ జీవో 55 ఆధారంగా పదేండ్లు అమలు చేశారని గుర్తుచేశారు. ఇవ్వాళ ఎందుకు జీవో 55ని రద్దు చేసి జీవో 29ని తెచ్చారని రేవంత్ రెడ్డిని ఉద్దేశించి ప్రశ్నించారు.

ముఖ్యమంత్రిని నిలదీయండి

దళితులు, గిరిజనులు, బలహీన వర్గాలు, మైనార్టీలకు అన్యాయం చేయడమే కాంగ్రెస్ పార్టీ విధానమా? అని హరీశ్‌రావు ప్రశ్నించారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆ వర్గం నుంచి ఉండి కనీసం స్పందించడం లేదని, గత బడ్జెట్ సమావేశాల సందర్భంగా శాసనసభలో ఈ విషయంపై భట్టిని అడిగామని చెప్పారు.దానికి ఆయన పరిశీలిస్తానని చెప్పారని, ఇప్పటికీ పట్టించుకోవడం లేదని తెలిపారు. దళిత, గిరిజన, బలహీన, మైనార్టీ వర్గాల శాసనసభ్యులు, మంత్రులు సీఎం రేవంత్ రెడ్డిని నిలదీయాలని హరీశ్ పిలుపునిచ్చారు. 'రాజ్యాంగం వల్లే ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు వచ్చినయ్. ఇవ్వాళ మీరు ఎమ్మెల్యేలు, ఎంపీలుగా గెలవడానికి అవకాశం ఇచ్చింది. ఆయా వర్గాల హక్కులను కాపాడే బాధ్యత మీపై ఉన్నది. దయచేసి స్పందించండి' అని ఎస్సీ, ఎస్టీ, బీసీ ఎమ్మెల్యేలను కోరారు. దేశంలో అతిపెద్ద రిక్రూట్‌మెంట్ ఏజెన్సీ యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ అని,గతంలో జీవో 55 ఎట్లయితే అమలు చేసామో యూపీఎస్సీలోనూ అదే తరహా రిజర్వేషన్ అమలువుతున్నదని చెప్పారు. అందులో రిజర్వేషన్ ఎట్ల అమలవుతది? తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌లో ఎందుకు కాదు? అని ప్రశ్నించారు. యూపీఎస్సీలో మొదటి 50 శాతం ఓపెన్ కాంపిటీషన్‌గా తర్వాత 50 శాతం రిజర్వ్డ్ క్యాటరిరీ చేస్తున్నారని, అదే మోడల్‌ను బీఆర్ఎస్ ప్రభుత్వం జీవో 55 రూపంలో అమలు చేసిందని గుర్తుచేశారు. ఓపెన్ కాంపిటీషన్ లేదా అన్ రిజర్వ్‌డు క్యాటగిరీలో ఎస్సీ, ఎస్టీ , బీసీ మైనార్టీ, ఈ డబ్ల్యూ.ఎస్‌లకు ప్రవేశం లేనట్టు కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమంగా జీవో 29ని తెచ్చిందని మండిపడ్డారు.

> ఎన్నికలప్పుడు, ఓట్లప్పుడు పోవుడు కాదు, రేవంత్‌రెడ్డీ.. దమ్ముంటే ఇప్పుడు సెక్యూరిటీ లేకుండా అశోక్‌నగర్ వెళ్లు. సెంట్రల్ లైబ్రరీలో విద్యార్థులతో కూర్చొని మాట్లాడి సమస్య పరిష్కరించు. ఎన్నికలప్పుడు పోతవు.. విద్యార్థులను రెచ్చగొడుతవ్.. మా మీద బురద జల్లుతవ్.. యువతను వాడుకుంటవ్, ఇవ్వాళ గద్దెనెక్కగానే వాళ్లను వదిలేస్తావా? -హరీశ్‌రావు

కాంగ్రెస్‌లో ప్రజాస్వామ్యం లేదా?

పిల్లల శరీరాలు కమిలిపోయేలా కొడుతుంటే రాహుల్‌గాంధీ ఎందుకు స్పందించడం లేదని హరీశ్ ప్రశ్నించారు. 'నిరుద్యోగ యువతను కర్కశంగా అణచివేసేందుకు రేవంత్‌రెడ్డి ప్రయత్నిస్తుంటే దళిత బలహీన వర్గాల మంత్రులు కనీసం స్పందించరా? రేవంత్‌రెడ్డిని ప్రశ్నించరా? పిల్లల పక్షాన మీరు నిలబడరా? కాంగ్రెస్‌లో ప్రజాస్వామ్యం లేదా? అని ప్రశ్నించారు. దీనిపై రాహుల్‌గాంధీ ఎందుకు స్పందించడం లేదని నిలదీశారు. ఓట్ల కోసం గల్లీగల్లీలో తిరిగిన రాహుల్ గాంధీ గడ్డకు ఎక్కిన తర్వాత ఎందుకు తెలంగాణవైపు చూడడం లేదని ప్రశ్నించారు.

యువతను నట్టేట ముంచిండ్రు

కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో చాలా విషయాలు చెప్పారని, వాటిలో ఒక్కటైనా అమలు చేశారా? అని హరీశ్ ప్రశ్నించారు. గ్రూప్-1 ప్రిలిమ్స్‌కు 1:50కి బదులు, 1:100 అవకాశం ఇస్తామని ఆరోజు మాట్లాడి ఎందుకు అమలు చేయడం లేదని నిలదీశారు. ఏడాదిలో రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు ఇస్తామని చెప్పి 10 నెలలు గడిచిందని, ఇంకా నెల పది రోజుల సమయమే ఉన్నదని, ఈ లోగా రెండు లక్షల ఉద్యోగాలు నింపాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ ఇచ్చిన ఉద్యోగాలు రేవంత్‌రెడ్డి ఇచ్చినట్టు చెప్పుకొంటున్నారని మండిపడ్డారు.

కోదండరాం.. ఎందుకు మాట్లాడ్తలేవ్?

'నిరుద్యోగులఎజెండానే నా ఎజెండా అంటివి.. కోదండరాం.. మీ గొంతుకు ఎందుకు మూగబోయింది? ఎందుకు మాట్లాడుతలేవు?' అని హరీశ్ నిలదీశారు. కోదండరాం, రియాజ్, చింతపండు నవీన్, ఆకునూరి మురళి వీరికి ఉగ్యోగాలు వచ్చాయి తప్ప నిరుద్యోగ యువతకు రాలేదని, నిరుద్యోగులను మోసం చేసి ఉద్యోగాలు పొందిన వీళ్లంతా ఇప్పుడు ఒక్క మాట మాట్లాడడం లేదని మండిపడ్డారు. 'ఆరోజు వీరే కదా చెప్పింది.. మీ గొంతుక అవుతాం, మీ సమస్యలు పరిష్కరిస్తామని.. మీరంతా ఇప్పుడు అశోక్‌నగర్‌కు వెళ్లండి..ఆరోజు అశోక్‌నగర్ గల్లీగల్లీలో తిరిగారు. ప్రతి కోచింగ్ సెంటర్‌కు తిరిగితిరి కదా? ఇప్పుడెందుకు వెళ్లడం లేదు?' అని ప్రశ్నించారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ ఫారూఖ్, రాష్ట్ర నాయకులు వేలేటి రాధాకృష్ణ శర్మ, కడవేర్గు రాజనర్సు, పాల సాయిరాం, మెర్గు మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

> రాష్ట్రానికి పదేండ్లు ముఖ్యమంత్రిగా ఉన్న కేసీఆర్ జీవో 55 ఆధారంగా రూల్ ఆఫ్ రిజర్వేషన్‌ను అమలు చేసిండ్రు. రేవంత్‌రెడ్డి వచ్చాక జీవో 55ను రద్దు చేసి కొత్తగా జీవో 29ని తెచ్చిండ్రు. దీనివల్ల ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ అభ్యర్థులకు తీవ్ర అన్యాయం జరుగుతున్నది. మీరు చెప్పేది ఒకటి చేసేది మరోటా? -హరీశ్‌రావు

కాంగ్రెస్, బీజేపీ చీకటి ఒప్పందం: హరీశ్

హైదరాబాద్, అక్టోబర్ 19 (నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్, బీజేపీ చీకటి ఒప్పందం మరోసారి బయటపడిందని మాజీ మంత్రి హరీశ్‌రావు స్పష్టంచేశారు. గ్రూప్-1 మెయిన్ అభ్యర్థులకు సంఘీభావం తెలిపేందుకు వెళ్లిన తమ పార్టీ నాయకులు శ్రీనివాస్‌గౌడ్, ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, ముఠా గోపాల్, దాసోజు శ్రవణ్ సహా ఇతర నాయకులను అరెస్టు చేశారని, బండి సంజయ్, బీజేపీ నేతలకు మాత్రం నిరసన తెలిపే అవకాశం కల్పించారని, దీనిద్వారా ఆ రెండు పార్టీల చీకటి ఒప్పందం మరోసారి తేటతెల్లమైందని హరీశ్ విమర్శించారు. బీజేపీకి ఒక న్యాయం.. బీఆర్ఎస్‌కు మరో న్యాయమా? అని ప్రశ్నించారు. గంటల తరబడి నిరసన తెలిపినా బండి అండ్ కోను అడ్డుకోని కాంగ్రెస్ ప్రభుత్వం, బీఆర్ఎస్ నేతలను మాత్రం అరెస్టు చేసిందని మండిపడ్డారు. నాయకుల అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నట్టు చెప్పారు. ప్రభుత్వం భేషజాలకు పోకుండా జీవో 29ని రద్దు చేసి, గ్రూప్స్ మెయిన్ పరీక్షను రీ షెడ్యూల్ చేయాలని డిమాండ్ చేశారు.

విలపిస్తున్న గ్రూప్ వన్ అభ్యర్థి..

ఆఖరి చాన్స్.. చేజారితే చావే దిక్కు!

హైదరాబాద్ సిటీబ్యూరో, అక్టోబర్ 19(నమస్తే తెలంగాణ): 'ఇది జీవితంలో ఆఖరి అవకాశం మళ్లీ రాదన్నా.. అవకాశం పోతున్నదని ప్రాణం పోతున్నది.. ఇక నాకు చావే దిక్కు' అని ఓ గ్రూప్-1 అభ్యర్థి కన్నీరు మున్నీరుగా దుఃఖిస్తూ ఆవేదన వ్యక్తం చేశాడు. సెక్రటేరియట్ వద్ద సొమ్మసిల్లి పడిపోయిన ఆ అభ్యర్థిని మీడియా ప్రతినిధులు, పోలీసులు తేరుకునేలా చేశారు. రెండేండ్లుగా కష్టపడుతున్నా, పదేండ్ల తర్వాత వచ్చిన అవకాశం, ఇట్లొచ్చి, అట్ల పోతున్నదని బాధను వెళ్లబోసుకున్నాడు. ఈ బతుకులు ఇంతే, చచ్చిపోతా.. అంటూ బాధను వ్యక్తం చేశాడు. నమ్మి ఓటేసి గెలిపిస్తే కుక్కలు చింపిన విస్తరిలా చేశారని చెప్పాడు. మరో అభ్యర్థి మాట్లాడుతూ నిరుద్యోగుల ఓట్లతో గెలిచి, సీఎం అయిన రేవంత్‌రెడ్డికి గ్రూప్-1 అధికారులు కావాల్సిన అభ్యర్థులు రోడ్డెక్కితే కనికరం లేదా? అని ధ్వజమెత్తారు. ఓట్ల కోసం అశోక్ నగర్ వచ్చిన విషయం మరిచిపోయావా? అంటూ మండిపడ్డారు.

రిజర్వేషన్ల రద్దుకు కుట్ర

- పరీక్షలను రీ షెడ్యూల్ చేయాలి
- నన్ను అరెస్ట్ చేసే దమ్ము ఎవరికీ లేదు
- కేంద్ర మంత్రి బండి సంజయ్

హైదరాబాద్, అక్టోబర్ 19 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో రిజర్వేషన్లు ఎత్తివేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధమైందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఆరోపించారు. శనివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయ న విలేకరులతో మాట్లాడుతూ.. గ్రూప్-1 పరీక్షల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లను వర్తింపజేయకుండా జీవో-29 జారీ చేసిందని విమర్శించారు. 'డిసెంబర్ 9 సోనియా జన్మదినం.. నిరుద్యోగుల పాలిట బలిదినం కాబోతుంది' అని ఎద్దేవా చేశారు. సీఎం రేవంత్‌రెడ్డికి ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా.. రిజర్వేషన్లపై స్పష్టమైన ప్రకటన చేయాలని, గ్రూప్-1 పరీక్షలను రీ షెడ్యూల్ చేయాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగుల ఆందోళన ప్రభుత్వానికి తెలిసేందుకే తాము ర్యాలీ నిర్వహించామని, తనను అరెస్ట్ చేసే దమ్ము ఎవరికీ లేదని పేర్కొన్నారు. సికింద్రాబాద్‌లో బజరంగ్‌దళ్ కార్యకర్తలు, ప్రజలపై పోలీసుల లాఠీచార్జిని ఖండిస్తున్నట్టు ప్రకటించారు.

గ్రూప్-1 వాయిదా వేయండి

- సీఎస్‌కు అభ్యర్థుల లేఖ

హైదరాబాద్, అక్టోబర్ 19 (నమస్తే తెలంగాణ) : సుప్రీం కోర్టులో కేసు ఉన్న నేపథ్యంలో గ్రూప్-1 మెయిన్స్ వాయిదా వేయాలని కోరుతూ అభ్యర్థులు సీఎస్ శాంతికుమారికి శనివారం లేఖ రాశారు. వేలాదిమంది అభ్యర్థులు బాధతో ఉన్నారని, తక్షణమే ప్రభుత్వం జోక్యం చేసుకుని పరీక్షలను వాయిదావేయాలని లేఖలో పేర్కొన్నారు. తమ శాంతియుత నిరసనలపై పోలీసుల అకృత్యాలు పెరిగిపోయాయని వాపోయారు.

లోకం పోకడ



అభ్యర్థులు గ్రూప్-1 అంటేనే జడుసుకునేలా ఇలా మార్చేశాం సార్!

ఇంత నిర్బంధంలో గ్రూప్-1 అవసరమా?

- మాజీ మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్ ఆగ్రహం
- బండి సంజయ్ పెద్ద పాలిటికల్ బ్రోకర్
- బీఆర్ఎస్ నాయకుడు ఆంజనేయగౌడ్ ఫైర్

హైదరాబాద్, అక్టోబర్ 19 (నమస్తే తెలంగాణ) : ఇంత నిర్బంధం మధ్య ప్రభుత్వం గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు నిర్వహించడం అవసరమా? అని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ప్రశ్నించారు. అభ్యర్థులు కోరినట్టు 2 నెలలు పరీక్ష వాయిదా వేస్తే నష్టమేంటని నిలదీశారు. శనివారం తెలంగాణభవన్‌లో మీడియాతో ఆయన మాట్లాడుతూ.. రెండు నెలలుగా రాష్ట్రవ్యాప్తంగా గ్రూప్-1 అభ్యర్థులు జీవో- 29పై ఉద్యమిస్తున్నారని, అభ్యర్థులను సచివాలయానికి పిలిపించుకొని మాట్లాడే సమయం సీఎంకు లేదా? అని నిలదీశారు. గ్రూప్-1 అభ్యర్థులకు మద్దతుగా వచ్చిన బీఆర్ఎస్ నేతలు దాసోజు శ్రవణ్, గజ్జెల నగేశ్, ముఠా జయసింహ, శ్రీనివాస్‌రెడ్డి, ప్రదీప్‌రెడ్డిపై దాడి చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారని, వారిని ఇంకా విడుదల చేయకపోవడమేంటని ప్రశ్నించారు. విద్యార్థులకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని, వారికి న్యాయం జరిగే వరకు పోరాటం ఆగబోదని స్పష్టంచేశారు. బీఆర్ఎస్ నేత ఆంజనేయగౌడ్ మాట్లాడుతూ.. కేంద్ర మంత్రి బండి సంజయ్ పొలిటికల్ బ్రోకర్గా, జోకర్గా మారారని విమర్శించారు. నిరుద్యోగులు తెలంగాణభవన్‌కు వచ్చి మొరపెట్టుకుంటే మద్దతిచ్చి అండగా నిలబడింది బీఆర్ఎస్ కాదా? కేటీఆర్ కాదా? అని నిలదీశారు. ఈ రోజు రోడ్డుపైకి వచ్చి రేవంత్ ప్రభుత్వాన్ని కాపాడే యత్నం చేస్తుంటే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. మోదీకి ముగ్గురు తమ్ముళ్లని.. పెద్దోడు రేవంత్, నడిపోడు బండి , చిన్నోడు అరవింద్ అని ఎద్దేవా చేశారు. సమావేశంలో నేతలు తుంగ బాలు, కిశోర్‌గౌడ్, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

రేవంత్ పక్షపాత వైఖరికి నిదర్శనం

- కాంగ్రెస్, బీజేపీ ఒక్కటేనని తేలింది : దాసోజు

హైదరాబాద్, అక్టోబర్ 19 (నమస్తే తెలంగాణ) : అశోక్‌నగర్ సాక్షిగా కాంగ్రెస్ సర్కార్ కుట్రబుద్ధి బయటపడిందని బీఆర్ఎస్ సీనియర్ నేత దాసోజు శ్రవణ్ విమర్శించారు. అశోక్‌నగర్‌లో నిరసన తెలుపుతున్న అభ్యర్థులకు మద్దతుగా నిలిచిన తమ పార్టీకి, బీజేపీకి వేర్వేరు న్యాయం ఉన్నదని చెప్పారు. సంఘీభావం తెలిపేందుకు వెళ్లిన తమపై పోలీసులు దాడిచేసి, అరెస్టు చేశారని, బీజేపీ నేతలకు సహకరించారని తెలిపారు. సైఫాబాద్ పోలీస్ స్టేషన్‌లో తనతోపాటు ముఠా జైసింహా, గజ్జెల నగేశ్, బండ్లగూడ పోలీస్‌స్టేషన్‌లో మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ సహా మరికొందరిని నిర్బంధించారని వివరించారు. బీజేపీ నేతలు బండి సహా అనేక మందిని విడిచిపెట్టారని, ఇదే ఆ పార్టీలు ఒక్కటనేందుకు ఉదాహరణ అని స్పష్టంచేశారు.

రోడ్లపైకి వస్తే చూస్తూ ఊరుకోవాలా?

- ఆందోళనలు చేస్తుంటే ఏం చేయాలె
- గ్రూప్-1 అంశం కోర్టు పరిధిలో ఉన్నది
- లా అండ్ ఆర్డర్ సమస్య రావొద్దనే లాఠీచార్జి
- గ్రూప్-1 పరీక్షలకు ఏర్పాట్లు సిద్ధం, 144 సెక్షన్
- మావోయిస్టులు వస్తే తిప్పిపంపిస్తాం : డీజీపీ

హైదరాబాద్, అక్టోబర్ 19 (నమస్తే తెలంగాణ) : 'గ్రూప్-1 అభ్యర్థులు ఇష్టానుసారంగా రోడ్లపైకి వచ్చి ఆందోళనలు చేస్తామంటే.. మేమంతా చూస్తూ ఊరుకోవాలా? అభ్యంతరాలు ఉన్నవాళ్లు సుప్రీం కోర్టుకు వెళ్లకుండా ఆందోళనలు చేస్తే ఎలా?' అని డీజీపీ జితేందర్ ప్రశ్నించారు. శనివారం హైదరాబాద్‌లోని డీజీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రూప్-1 సమస్య కోర్టులో ఉన్నదని, దానిపై ఏమైనా అభ్యంతరాలుంటే సుప్రీం కోర్టుకు వెళ్లాలి గాని రోడ్లపై తిరుగుతూ ఆందోళనలు చేస్తామంటే ఎట్లా? అని అన్నారు. ప్రజలకు ఇబ్బంది రావొద్దనే లాఠీచార్జి చేయాల్సి వచ్చిందని చెప్పారు. 'పబ్లిక్ ప్లేసుల్లో ఇలా ఆందోళనలు చేస్తుంటే మేమేం చేయాలో మీరే చెప్పండి' అంటూ ఉల్టా మీడియా ప్రతినిధులను ప్రశ్నించారు. గ్రూప్-1 పరీక్షలకు పటిష్ట బందోబస్తు నిర్వహించినట్టు చెప్పారు. అవసరమైతే ప్రత్యేక సిబ్బందితో బందోబస్తు నిర్వహిస్తామని తెలిపారు. పరీక్ష నిర్వహణ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని, ఎవరైనా పరీక్షలు అడ్డుకోవాలని చూస్తే.. చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నగరంలోని ఓ గుడి వద్ద పరిస్థితి అదుపుతప్పడంతోనే లాఠీచార్జి చేసినట్టు చెప్పారు. పోలీసుల అదుపులో మావోయిస్టు సుజాత ఉన్నట్టు వస్తున్న వార్తల్లో నిజం లేదన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో ముగ్గురికి శిరోముండనం చేసిన ఘటన తన వరకూ వచ్చిందని, దానిపై విచారణ చేసి, తక్షణం చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఇలా చేయడం మంచిపద్ధతి కాదని, పోలీసులకు ఇలాంటి చర్యలు చెడ్డపేరు తెస్తాయన్నారు. పంజాగుట్ట పీఎస్‌లో చోటుచేసుకున్న హోంగార్డు ఆత్మహత్య వివరాలు తన వరకూ రాలేదని డీజీపీ తెలిపారు. పోలీసు ఆరోగ్య భద్రత కార్డుపై వైద్యం అందక ఓ ఏఆర్ ఎస్సై చనిపోయాడని డీజీపీ దృష్టికి తేగా దానిపై విచారిస్తున్నట్టు చెప్పారు. ప్రభుత్వం నుంచి నిధులు రావాల్సి ఉన్నదని, అందుకు పోలీసుశాఖ నుంచి ప్రతిపాదనలు పంపామని చెప్పారు. ఈ నెల 21న పోలీసు అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకొని పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు డీజీపీ చెప్పారు.

కుక్కల్ని కొట్టినట్టు కొట్టిన్రు

గ్రూప్స్ అభ్యర్థులపై మళ్లీ లాఠీచార్జి

- సెక్రటేరియట్ ముట్టడిపై ప్రతాపం
- లాఠీలతో చావబాది.. పాశవికంగా ఈడ్చిపడేసిన పోలీసులు
- నాలుగోరోజూ ఉద్యోగార్థుల అరెస్టులు

హైదరాబాద్, అక్టోబర్ 19 (నమస్తే తెలంగాణ): 'మహిళలని చూడకుండా పోలీసులు మమ్మల్ని కుక్కల్ని కొట్టినట్టు కొట్టిన్రు' అంటూ గ్రూప్స్ ఉద్యోగార్థుల ఆక్రందన మళ్లీ వినిపించింది. ముందురోజే అశోక్‌నగర్ సాక్షిగా దొరికిన వారిని దొరికినట్టే ఆడ, మగ అని తేడా లేకుండా ఉరికించుకుంటూ కొట్టిన పోలీసులు.. సచివాలయం సాక్షిగా మళ్లీ లాఠీచార్జికి దిగారు. ఎక్కడి కక్కడే ఈడ్చిపడేశారు. కాళ్లు, చేతులు పట్టి గుంజేశారు. కడుపులో పిడిగుద్దులు గుద్దారు. రెక్కలిరిచి.. పోలీసు వ్యాన్లలో కుక్కారు.

'వస్తారా బయటకు.. రావాలా లోపలికి'

సచివాలయ ముట్టడి సందర్భంగా అంతకు ముందు 'వస్తారా బయటకు.. రావాలా లోపలికి' అంటూ అభ్యర్థులు చేస్తున్న నినాదాలతో ఆ ప్రాంగణం హోరెత్తింది. సచివాలయం ప్రధాన గేటుకు ఎదురుగా నిరసన తెలుపుతున్న వారిని పోలీసులు ఈడ్చుకుంటూ తీసుకెళ్లారు. 'మహిళలని చూడకుండా కుక్కల్ని కొట్టినట్టు కొట్టారు' అంటూ ఒక్కో బాధితురాలు కన్నీటి పర్యంతమవుతుంటే.. విన్నవారి హృదయాలు చలించక మానవు. కనికరం చూపని మహిళా కానిస్టేబుళ్లు.. తమను వ్యాన్లలోకి విసిరిపారేశారని కన్నీరు పెట్టుకున్నారు. తమ బతుకు కోసం పోరాడటం తప్పా అని.. బోరున విలపించారు.

బీఆర్ఎస్ నేతల అరెస్టు

గ్రూప్-1 అభ్యర్థులకు మద్దతుగా పాల్గొన్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, ఎమ్మెల్యే ముఠా గోపాల్, దాసోజు శ్రవణ్, ముఠా జయసిహాను సచివాలయం వద్ద అరెస్టు చేశారు. నేతలనూ వ్యాన్లలోకి ఈడ్చిపడేశారు. అరెస్టు చేసి, స్టేషన్‌కు తరలించారు.

తన్నుకుంటూ అరెస్టులా?: ఆర్ఎస్పీ

పోలీసులు బూటుకాళ్లతో తన్నుకుంటూ నిరుద్యోగులను, నేతలను అరెస్టు చేశారని బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ధ్వజమెత్తారు. పేదలందరికీ ఓపెన్ క్యాటగిరీ వర్తించాలని స్పష్టం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం జీవో 55 తీసుకొచ్చి న్యాయంచేసిందని, కాంగ్రెస్ సర్కార్ జీవో 29ని తీసుకొచ్చి అన్యాయం చేసిందని విమర్శించారు. సమైక్యాంధ్ర పాలన కంటే దారుణంగా రేవంత్‌రెడ్డి పాలన ఉన్నదని ధ్వజమెత్తారు. పోలీసులను నమ్ముకున్న ఏ రాజ్యం కూడా బాగుపడ్డట్టు చరిత్రలో లేదని తేల్చిచెప్పారు. అభ్యర్థుల డిమాండ్లను పరిష్కరించాలి. తక్షణం జీవో 29ను రద్దు చేయాలి' అని డిమాండ్ చేశారు.

అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు

అక్రమ అరెస్టులు, నిర్బంధాలతో గ్రూప్-1 అభ్యర్థుల ఉద్యమాన్ని ఆపలేరని బీసీ కమిషన్ మాజీ సభ్యులు కిశోర్, ఉపేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ప్రజాస్వామ్యయుతంగా నిరసన తెలుపుతున్న నిరుద్యోగులపై లాఠీచార్జి చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. నిరుద్యోగులకు మద్దతు తెలిపేందుకు వెళ్లిన మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్యే గోపాల్, బీఆర్ఎస్ నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్, దాసోజు అరెస్టును ఖండించారు. హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక మోసం చేశారని మండిపడ్డారు.

అది ఆర్ఎస్ బ్రదర్స్ బంధమా?: సతీశ్‌రెడ్డి

సీఎం రేవంత్‌రెడ్డి, బీజేపీ కేంద్ర మంత్రి బండి సంజయ్ మధ్యన ఉన్నది ఆర్ఎస్ (రేవంత్‌రెడ్డి, సంజయ్) బ్రదర్స్ బంధమని బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ వై సతీశ్‌రెడ్డి ఎద్దేవా చేశారు. జీవో 29 ర